# భార్యాస్మృతి

ఆ దేశమును ఒకరాజు పాలిస్తున్నాడు. అతడు ధర్మశీలుడు, ఏకపత్నీవ్రతుడు.

ఆ రాజు వివాహమాడిన కన్య బాల్యమునుంచీ అతని ప్రేమ దృష్టులలోనే పెరిగింది. ఆమె హృదయాన ప్రేమాంకురాలు పుట్టడానికి అతని ప్రేమదృష్టులే కారణము. ఆమెలో ప్రేమాంకురాలు పుట్టిననాటి నుంచీ అతని హృదయము రాజ్యము మీద నుంచి మళ్ళి ఆమె మీదనే పూర్తిగా లగ్నమయిపోయింది.

వారికి వివాహమైనది. ఎడబాటెరుగని ప్రేమసౌఖ్యములకు వారే పరమావధి అనిపించుకొన్నారు.

వారి ప్రేమ బాల్యములో పుట్టింది. లేతమామిడి చిరుగులాగ నవ నవలాడింది.

యౌవనములో మందారపుష్పమువలె వారి ప్రేమ వికసించింది, మల్లెపువ్వులాగ వాసించింది.

యౌవనము సడలుతోంది. వారి ప్రేమ దృఢమౌతుంది.

వారి ప్రేమకు ఫలముగా వారికి రత్నాలవంటి కొడుకులూ, కూతుళ్ళూ పుట్టారు.

సుఖదుఃఖాల కాకరమైన సంసారములో పడ్డవాళ్ళు మహారాజులైనా; ఎంతటి ప్రేమ వాళ్ళల్లో ప్రజ్వలిస్తూవున్నా, వాటి ఫలాలను వారనుభవించక తీరదు.

రాణీగారి కష్టలేశము రాజుగారికి మహాకష్టమయ్యేది. రాణీగారి దగ్గిరికి దుఃఖలేశమైన చేరకుండా రాజుగారు తమ జాగ్రత్తను, దైవ శక్తిని, అధికారాన్ని, హృదయాన్ని కాపలా ఉంచేవారు.

ఈ విధంగా చాలాకాలం జరిగింది.

విధివశాన ఒకనాడు రాణీగారికి చిన్న జబ్బు చేసింది. మందు లిచ్చారు. కుదరలేదు జబ్బు తీవ్రమయింది. రాజ్యములో ఉండే వైద్య శిఖామణులందరూ అలోచించి వైద్యము చేశారు. రోగము తిరుగుముఖము పెట్టలేదు. ఆనాటికానాడు రోగము ముదిరిపోయింది. వాడివాడి, కొమ్మ నుంచి పువ్వు రాలిపోయినట్లు ఆవిడ ఇహలోకాన్ని విడిచిపోయింది.

రాజుగారికి రాజ్యములో ఉండే ప్రజలంతా అనునయము కల్పించ డానికి ప్రయత్నించారు. రాజుగారెంత దుఃఖించారో ప్రజలంతగా దుఃఖించారు. రాజ్యము రాజ్యమంతా దద్దరిల్లిపోయింది.

రాజుగారికి దుఃఖము తీరలేదు. రాజ్యకార్యములనుంచి విరమించి రాజు తన ప్రేమమూర్తిని నిరంతరమూ ధ్యానిస్తూ కాలం వెళ్ళబుచ్చు తున్నాడు. దుఃఖము తీరడంలేదు! స్నేహితులు; బంధువులు, అప్తులు ఎవరూ ఏమీ చెయ్యలేకపోయారు. ఆయన ముఖాన మందహాసమైనా ఎప్పుడూ అంకురించడంలేదు.

రాణీగారిని విడిచి రాజుగారు అట్టేకాలం ఉండలేరు అనుకొన్నారు ప్రజలు. ప్రజల భగవత్ప్రార్థనలు కూడా రాజుగారి దుఃఖాన్ని అరికట్ట లేకపోయినవి.

ఆ రాజ్యములోనే ఒక మర్రిచెట్టుకింద ఒక బిచ్చగాడున్నాడు. అతనికి నడివయస్సు దాటింది. అతన్ని ఆశ్రయించి, నడివయస్సులో ఉన్న ఒక స్త్రీ కూడా ఆ చెట్టునీడనే ఉన్నది. వారిద్దరూ ఆ చెట్టుకిందే నక్షత్రాలనూ, చంద్రుణ్ణి సాక్షులుగా పెట్టుకొని చాలాకాలం కిందటనే పెళ్ళిచేసుకొన్నారు.

చిన్నతనములో ఆ బిచ్చగాడు ఆ మర్రిచెట్టు నీడను చేరాడు. ఎందుకుచేరాడో అతనికి తెలియదు. తనను కనిపెంచిన తల్లిదండ్రు లెవరో అతనికి తెలియలేదు. తోటి బిచ్చగాళ్ళ సహవాసమువల్ల అతడు

బిచ్చమెత్తి పొట్టపోసుకోవడం నేర్చుకున్నాడు. తన చెట్టుకంటే సౌఖ్య ప్రదమైన అవాసము వేరే ఇంకొక్కటి ఉండవచ్చునని అతడనుకోలేదు.

వేసవికాలంలో సూర్యుడు నిప్పులు కురుస్తూన్నప్పుడూ పూళు పులు కొట్టుతూన్నప్పుడూ ఆ చెట్టునీడే అతన్ని కాపాడింది. వానా కాలంలో జోరున వానధారలు పడుతూన్నప్పుడూ, ధనికులు తాము వెచ్చగా ఇళ్లల్లో హాయిగా ఉండేటప్పుడూ—ఆ చెట్టునీడ పక్షులకువలెనే అతనికి శరణమయ్యేది. శీతాకాలంలో చలి గడగడ వణికించేటప్పుడూ, రాజులు రకరకాల కంబళీలతో చలిని తరిమివెయ్యడానికి ప్రయత్నించే టప్పుడూ, ఆ చెట్టునీడే అతనికి — చిరుగుగుడ్డలు కప్పుకునే అతనికి — వెష్టనిచ్చేది. వసంత కోయిలలు అతని చెట్టుమీద కూర్చుని కూసేవి, చిలకలు పలికేవి. సాయంకాలము కాగానే ఆ చెట్టుతొర్రలో కాపుర ముండే రెండు గుడ్లగూబలు బయటికివచ్చి అతన్ని పలకరించేవి.

అప్పుడప్పుడు అతని స్నేహితులు — తోటి బిచ్చగాళ్ళు ఆ చెట్టు కిందికి వచ్చి అతనితో ఇష్టాగోష్టి జరిపేవారు.

అతనికి యౌవనము అంకురించింది. యౌవనానికి జాతి మత విచక్షణలేదు. ధనముతో సంబంధములేదు, జంతువులూ, మనుష్యులూ అనే భేదంలేదు. వందలకొద్ది భార్యలను పెండ్లాడగల రాజులనే ఆశ్ర యించాలని దానికుండదు. కూటికి ఇరుగని బిచ్చగాళ్ళ నాశ్రయించడ మెందుకనుకోదు, యౌవనం రాజుల నాశ్రయించిన తాను బిచ్చగాళ్ళ నాశ్రయిస్తే పరువులోపమేమో ననుకోదు. నల్లవాళ్ళ నాశ్రయిస్తే తెల్ల దొరలకు కోపం వస్తుందేమోనని కూడా అనుకోదు.

అతనికి యౌవనం అంకురించడంతోనే ఏదో ఒక "వదలని కోరిక" అతనిని పట్టుకొంది. ఏమిటో తెలియదు. బిచ్చమెత్తుకొని పొట్ట నింపుకోవాలనే సంగతి అప్పుడప్పుడు మరిచేవాడు.

ఒకనాడు రైలుస్టేషనులో అడుక్కోడానికి అతడు వెళ్ళాడు. ఆ రైలులోనుంచి ఒక ఆడపిల్ల దిగింది. చిరుగు గుడ్డలలోనుంచి పడుచు తనపు లావణ్యము పైకి ఉరుకుతోంది. పిల్ల గేటుదగ్గిరికి వచ్చింది టిక్కట్టులేదు. బంట్రోతు మెడమీద చెయ్యివేసి గెంటాడు. తూలి కింద

పడింది. జారిపోయిన బట్టలమూట తీసుకొంది. నవ్వింది. బిచ్చగాడు చూచాడు. తన బసకు ఆమెను తీసుకువెళ్ళాడు. అనాడే ఆ చెట్టుకిందే వారికి వివాహం జరిగింది.

ప్రతిరోజూ వారిద్దరూ కలిసి బిచ్చానికి బయలుదేరేవారు.

ఆ కోయిలల కూజితములలో, ఆ చిలుకలపలుకులలో, ఆ గుడ్ల గూబల కూతలలో, ఆ వెన్నెలలో, ఆ ఘూఘుపులలో, ఆ చలిలో, ఆ ఎండలో తమ జీవితాన్ని కలిపివేసుకొని ఆ చెట్టునీడలో వాళ్ళు సుఖమూ అనుభవించారు — రాజులనుభవించే సుఖమే! గొప్పవాళ్ళనుభవించే సుఖమే. దుఃఖమూ అనుభవించారు — రాజులూ, గొప్పవాళ్ళూ అనుభవించేలాటి దుఃఖమే!

వాళ్ళకు మధ్యమధ్య సంతానం కూడా కలిగింది, పిల్లలు కాలు రావడంతోనే ఏదో ఒక చిప్పపట్టుకొని తల్లిదండ్రులను వదిలిపెట్టి ఏదో ఒక చెట్టునో, ఒక వీధినో ఆశ్రయించేవారు. వారికి కలిగిన సంతానమంతా ఈ విధముగా అన్ని దిక్కులకూ చెదిరిపోయారు. బిచ్చగాడూ వాడి భార్య ఈ విధంగా కాలక్షేపంచేస్తూ ఉండగా ఒకనాటి సాయంకాలం విధివశాన ఆమెకు చిన్న జబ్బు చేసింది. రాత్రల్లా మేలుకొని ఆమె జబ్బును తన ఆలోచనలతో కోరికలతో పోగొట్టవలెనని అతడు ప్రయత్నించాడు. తెల్లవారేసరికి జబ్బు నిమ్మళించలేదు సరికదా ఆమె బిచ్చానికి బయలుదేరడానికి కూడా ఓపిక లేకపోయింది. ఆమెను ఆ చెట్టుకిందే పడుకోబెట్టి తన భుజంమీద గుడ్డ ఆమెకు కప్పి బిచ్చగాడు తన చిప్పా, కర్రా పుచ్చుకొని బిచ్చమెత్తుకోడానికి బయలుదేరాడు. బయలుదేరకపోతే ఎట్లా? ఆ రోజుకు గంజేదీ?

ఒంటరిగా వచ్చావేమని తోడిబిచ్చగాళ్ళు అడిగారు. చెప్పాడు, అందులో ఒకడు ఒకమాత్ర యిచ్చి ఆమెకు వెయ్యమన్నాడు! బిచ్చగాళ్ళలోనూ వైద్యులున్నారు! కొన్ని వీధులు తిరిగి కొంచెం బియ్యం బిచ్చమెతుకొని యింటికివచ్చి భార్యకు మాత్రవేశాడు. బియ్యం చెట్టుకిందే ఉడికించాడు. తానింత తిన్నాడు. భార్య తినేస్థితిలోలేదు. మిగిలిన గంజీ కూడా అక్కడ వదిలిపెట్టి భార్యదగ్గిరచేరి ఆమెకు ఉపచారం

చేస్తున్నాడు. రోగం మాత్రం ముదురుతోంది. కొన్నాళ్ళు గడచినవి. ఆమెకు బ్రతికే యోగ్యతలేదని బిచ్చగాళ్ళు నిశ్చయించారు. ఒకనాటి రాత్రి ఆమె ఆ చెట్టుకిందే ప్రాణాలు వదిలిపెట్టింది. బిచ్చగాడు ఆమె పక్కనే కూచున్నాడు. అతడుపడ్డ కష్టాలూ, అతడు పొందిన దుఃఖమూ ఆ మర్రిచెట్టుకుతప్ప ఇంకెవరికీ తెలియవు.

రెండు రోజులయింది. ఆ బిచ్చగాడు ఒక్కడూ ఆ చెట్టుకిందే పడివున్నాడు. మూడోరోజు వచ్చింది. ఆకలి వేసింది. జోలి చూచుకొన్నాడు. కుక్కలు జోలి పీకివేసి బియ్యం తినివేసినవి. తోడిబిచ్చగాళ్ళు తమ పొట్టకోసం తంటాలుపడుతూ అతని సంగతే మరిచారు. చిరిగినజోలి చేత్తోపుచ్చుకొని తూలుతూ అ బిచ్చగాడు ఇంటింటికీ బిచ్చమెత్తడానికి వెళ్ళాడు. "మొద్దులావున్నావు, కూలి చేసుకోకూడదా" అన్నారు కొందరు మామూలుప్రకారం. "చెయ్యి ఊరుకోలే"దన్నారు కొందరు. "పాడితేనేగాని బియ్యం వెయ్య"మని కొందరు పిల్లలన్నారు. మధ్యాహ్నమయింది. ఒక ముసలి ముత్తయిదువ 'గంజి తాగుతావా అబ్బీ' అంది. దాక పట్టేడు. ఆమె పోసినగంజి తాగాడు. మర్రిచెట్టు కిందికి వచ్చాడు. జోలి తలకింద పెట్టుకొని కళ్ళుమూసుకొన్నాడు.

* * *

రోజురోజూ అతడు బిచ్చానికి వెళ్ళుతూనూ ఉన్నాడు. పొట్ట నింపుకొంటూనూ ఉన్నాడు. ఏదో ఒకవిధంగా, భార్యనప్పుడప్పుడు తలుచుకొంటూనూ ఉన్నాడు. యధాప్రకారం కోయిలలు కూస్తూనూ ఉన్నవి. చిలకలు పలుకుతూనూ ఉన్నవి. గుడ్లగూబలు సాయంకాలం కావడంతోనే అతన్ని—అతన్ని ఒక్కణ్నే—పలకరిస్తూనూ ఉన్నవి.

—: o :—